కుర్చీ ఖాళీ..!

కీలక పోస్టుల్లో అధికారులు లేరు

- కదిరిలో ఐదు నెలలుగా ఆర్ఐ పోస్టు ఖాళీ
- మూడునెలలుగా గాండ్లపెంట ఎస్ఐ పోస్టు...
- తలుపుల, ఎన్పీకుంట, గాండ్లపెంటకు ఇన్‌చార్జ్ తహసీల్దార్లే
- ఎన్పీకుంటలో పది పంచాయతీలకు ఇద్దరే కార్యదర్శులు
- సిబ్బంది లేక అవస్థలు పడుతున్న ప్రజలు



నియోజకవర్గంలో యంత్రాంగాన్ని నడిపే అధికారులు లేకపోవడంతో పాలన కుంటుపడుతోంది. మండల పాలనకు కీలకమైన తహసీల్దార్, ఎంపీడీఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్న అధికారులు కీలక నిర్ణయాలు తీసుకోలేకపోతు న్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. గాండ్లపెంట మండలంలో మూడు నెలలుగా ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉండటంతో శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. తలుపుల, ఎన్పీకుంట, గాండ్లపెంట మండలాలకు రెగ్యులర్ తహసీల్దార్లు లేరు. ఎన్పీకుంట మండలంలో రెగ్యులర్ ఎంపీడీఓ లేరు. దీంతో వివిధ సమస్యలపై ఆయా కార్యాలయాలకు వచ్చే బాధితులకు నిరాశే ఎదురవుతోంది. రెగ్యులర్ అధికారుల రాకకోసం ఆయా మండలాల ప్రజలు నిరీక్షిస్తున్నారు.

కదిరి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు కీలక పోస్టుల్లో అధికారులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు , ఎస్ఐ పోస్టులు ఖాళీ ఉండటంతో ప్రజలకు సమస్యలు ఎదురవుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బదిలీలు జరిగాయి. ఆ బదిలీల్లో కూడా ఈ కీలకమైన పోస్టులు భర్తీకాలేదు. ఉన్నతాధికారులతోపాటు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని ఈ పోస్టులను భర్తీ చేయాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

మూడు మండలాలకు ఇన్‌చార్జ్ తహసీల్దార్లే

మండలంలో తహసీల్దార్ పోస్టు అత్యంత కీలకమైనది, ముఖ్యమైనది. అయితే తలుపుల, ఎన్పీకుంట, గాండ్లపెంట మండలాలకు రెగ్యులర్ తహసీల్దార్లు లేరు. దీంతో ఇన్‌చార్జ్‌లతో పాలన నెట్టుకొస్తున్నారు. దీంతో భూమికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన సమస్యల పరిష్కారంలో ఆయా ఇన్‌చార్జ్‌లు చొరవ చూపడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. తలుపుల మండలంలో ఓ ప్రయివేటు డాక్టర్ ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే ఇంతవరకు దానిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ డాక్టర్ ఆక్రమించుకున్న భూమిలో వెనుక పొలాలకు పోయే రైతులకు దారి ఉంది. ఈవిషయాన్ని పలుమార్లు రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చివరకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందించి రైతులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంతవరకు ఆసమస్య పరిష్కారం కాలేదని రైతులు వాపోతున్నారు. గాండ్లపెంట మండలంలో పలు భూ సమస్యలు ఉన్నా, ఇన్‌చార్జ్ తహసీల్దార్ పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఇన్‌చార్జ్ కావడం వల్లే సరైన నిర్ణయం తీసుకోలేకపోన్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఆర్ఐ పోస్టు ఖాళీ

నియోజకవర్గ కేంద్రమైన కదిరి మండలంలో ఒక్క ఆర్ఐ కూడా లేరు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్ఐ మున్వర్ బాషా వివిధ ఆరోపణలతో ఓడీసీకి బదిలీ అయ్యారు. అప్పటినుంచి ఇక్కడ ఆర్ఐ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో వివిధ ధ్రువపత్రాల కోసం వచ్చే లబ్ధిదారులు, భూ సమస్యలు, ఇంటి సమస్యలు పరిష్కారం కాకుండానే మిగిలిపోతున్నట్లు తెలిసింది. ఇళ్లపట్టాలు, పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలంటే ఆర్ఐ రిపోర్టు తప్పనిసరి. ఆర్ఐ లేకపోవడంతో వాయిదా పడుతున్నట్లు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. సర్వేయర్ సస్పెండ్ కావడంతో ఆ పోస్టుకూడా ఖాళీగా ఉంది. భూములు సర్వే చేయించుకోవాలంటే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. తహసీల్దార్ కార్యాలయానికి వస్తే ఒక్క పని కావడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మూడు నెలలుగా గాండ్లపెంట ఎస్ఐ పోస్టు ఖాళీ

గాండ్లపెంట మండలంలో మూడు నెలలుగా ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉంది. ఎన్నికల తరువాత ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ కృష్ణవేణి బదిలీపై తాడిమర్రికి వెళ్లారు. ఆ తరువాత ఇక్కడ ఎస్ఐని నియమించలేదు. మూడు నెలలుగా ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉంది. అంతకుముందు ఈస్టేషన్‌కు ఎస్ఐగా ఇసాక్‌ను నియమించారు. ఇతను చేరిన రోజే బదిలీపై వెళ్లిపోయారు. అప్పటినుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంది. ఏఎస్ఐగా పనిచేస్తున్న రంగా ఇటీవల కొత్తచెరువుకు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం ఆ పోస్టుకూడా ఖాళీగా ఉంది. ఎస్ఐ, ఏఎస్ఐ పోస్టులు ఖాళీగా ఉండటంతో ఫిర్యాదుదారులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నట్లు పేర్కొన్నారు. ఈప్రాంతం నుంచి నిత్యం చౌకబియ్యంతో పాటు, కలప, గ్రానైట్ అక్రమ రవాణా అవుతున్నట్లు సమాచారం. వీటిని అరికట్టాలంటే ఎస్ఐ అవసరం ఉంది.

కదిరిలో ఐదు నెలలుగా పది పంచాయతీలకు ఇద్దరే కార్యదర్శులు

ఎన్పీకుంట మండలంలో పది పంచాయతీలున్నాయి. ఇద్దరే కార్యదర్శులున్నారు. వీరిలో ఒకరుగ్రేడ్-4 కాగా, మరొకరు గ్రేడ్ -5 కార్యదర్శి. ఈఇద్దరు 8 పంచాయతీలకు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. పని ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నట్లు తెలిసింది. ఈమండలంలో ఎంపీడీఓ కూడా ఇన్‌చార్జ్ అధికారే. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ ఆదినారాయణ ఉద్యోగ వీరమణ చేసిన తరువాత, మరో ఎంపీడీఓను నియమించలేదు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అంజనప్ప వ్యవహరిస్తున్నారు. ఇతను చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నట్లు సమాచారం. దీంతో పనులన్నీ కుంటుపడుతున్నాయని, పర్యవేక్షణ కరువైందని ప్రజలు వాపోతున్నారు.




అధికారులను నియమించాలి

వివిధ మండలాల్లో ఖాళీగా ఉన్న తహసీల్దార్లు, ఎస్ఐ, ఏఎస్ఐ, ఆర్ఐ, సర్వేయర్లు, కార్యదర్శుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. కీలక పోస్టుల్లో అధికారులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులను వెంటనే నియమించాలి.

- సాంబశివ, సీఐటీయూ నాయకుడు, కదిరి

నివేదికలు పంపాం, ఆర్డీఓ వీవీఎస్ శర్మ

మూడు మండలాల్లో ఇన్‌చార్జ్ తహసీల్దార్లు ఉన్న మాట వాస్తవమే. తహసీల్దార్ల నియామకం కోసం కలెక్టర్ టీఎస్ చేతన్ దృష్టికి తీసుకెళ్లాం. అధికారులు నియామకాలు చేపట్టాల్సి ఉంది.



సమస్యలు పరిష్కారం కావడం లేదు..

మండలంలో ఉన్నతస్థాయి అధికారులు లేకపోవడంతో ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదు. పోలీస్‌స్టేషన్‌లో గత మూడునెలలుగా ఎస్ఐ లేరు. ఏఎస్ఐ కూడా బదిలీపై వెళ్లారు. దీంతో వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలు వెనుతిరుతున్నారు. తహసీల్దార్ లేకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్‌కు తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఉన్నతాధికారులు స్పందించి ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి.

- కేకే రాజారెడ్డి, రైతుసంఘం, గాండ్లపెంట

ఉన్నతాధికారులకు తెలిపాం

గాండ్లపెంటలో ఎస్ఐ, ఏఎస్ఐ ఖాళీ విషయాలను ఎస్పీ రత్న దృష్టికి తీసుకెళ్లాం, త్వరలోనే ఉన్నతాధికారులు ఖాళీలను భర్తీచేస్తారు.

- శివనారాయణరెడ్డి, డీఎస్పీ, కదిరి

స్వచ్ఛాంధ్రలో ప్రజలు భాగస్వాములు కావాలి

కలెక్టర్ టీఎస్ చేతన్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. మండలంలోని పెడబల్లి జడ్పీ ఉన్నతపాఠశాలను కలెక్టర్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలు, పట్టణాలను స్వచ్ఛతకు ప్రతీకగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒకరూ కృషి చేయాలన్నారు. అనేక చోట్ల దీర్ఘకాలంగా పేరుకుపోయిన చెత్త, డపింగ్ యార్డులు, మురుగు కాలువలను పూర్తిగా శుభ్రం చేసే చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు తమ ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. విద్యార్థులకు పరిశుభ్రత, పర్యావరణం, మొక్కల పెంపకంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల వంటగది, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఈఓ క్రిష్టప్ప, పశుసంవర్ధక శాఖ జేడీ శుభదాస్, ప్రధానోపాధ్యాయులు రమామణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగిన యజ్ఞం



యజ్ఞం నిర్వహిస్తున్న రుత్వికులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విశ్వశాంతి, లోక సంరక్షణ కోసం చేపట్టిన అతిరుద్ర మహాయజ్ఞం శనివారం కొనసాగింది. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతు నందు వేదపండితులు వేదమంత్రాలతో 11హోమాలలో యజ్ఞాన్ని కొనసాగించారు. గణపతిపూజతో మొదలుపెట్టి రుద్రాభిషేకం, సర్వదేవతార్చన నిర్వహించారు. యజ్ఞం తిలకించేందుకు వేలాది మంది భక్తులు హాజరయ్యారు.

నేరాలకు చెక్ పెట్టండి

- ఎస్పీ రత్న



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పేకాట, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని, రౌడీషీటర్ల నడవడికపై నిరంతరం నిఘా ఉంచాలని, లాంగ్ పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ రత్న పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి శనివారం ఆమె జూమ్ కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. సమీక్షలో జిల్లా ఎస్పీ గ్రేవ్, నాన్‌గ్రేవ్, ఎస్సీ, ఎస్టీ, పోక్సో, మర్డర్, చోరీ కేసుల గురించి ఆరా తీశారు. అరెస్టయిన నిందితులపై త్వరితగతిన చార్జ్‌షీట్ వేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాలికలు, మహిళపై అఘాయిత్యాలు, రాజకీయ సమస్యలు, వంటివాటిపై నూతన ప్రణాళికలు రచించి చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రోన్, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంచి ఎక్కడికక్కడి సమస్యలు తెలుసుకోవాలన్నారు. పేకాట, మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటివాటిపై ప్రత్యేక నిఘా ఉంచి, అడ్డుకట్ట వేయాలన్నారు. రాత్రివేళల్లో బీట్లు పెంచాలని, పల్లె నిద్రలు ఎక్కువగా చేయాలన్నారు. సబ్ డివిజన్ల వారిగా రౌడీషటర్ల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, లీగర్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, ఎస్బీఎస్సై ప్రదీప్‌కుమార్, ఐటీకోర్ ఇన్‌చార్జ్ సుదర్శన్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుల ఉరికి మరో రైతు బలి

పూలకుంటలో అన్నదాత ఆత్మహత్య



చంద్రశేఖర్ (ఫైల్)

తనకల్లు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక మండలంలోని పూలకుంట గ్రామానికి చెందిన రైతు చంద్రశేఖర్ (33) శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పూలకుంటపల్లికి చెందిన చంద్రశేఖర్ పదేళ్లుగా వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. తన తండ్రి ఈశ్వరప్ప పేరుతో ఉన్నఐదు ఎకరాల భూమిలో రెండు బోరు బావులు తవ్వించాడు. పొలంలో వివిధరకాల పంటలు సాగు చేసేవాడు. మూడేళ్లుగా టమోటా, దోస పంటలు సాగు చేశాడు. పెట్టుబడుల కోసం రైతులు, వడ్డీ వ్యాపారుల వద్ద దాదాపు రూ. పదిలక్షలు అప్పులు చేశాడు. పంటలు పండినా, గిట్టుబాటు ధరలు లేకపోవడంలో తీవ్రంగా నష్టపోయాడు. ఆరు నెలల కిందట ఫైనాన్స్‌లో రూ.12లక్షలు అప్పు తీసుకుని ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ప్రతినెలా ట్రాక్టర్ కంతులు, వడ్డీలు రూ.లక్షకుపైగా చెల్లించాల్సి వచ్చింది. అయితే వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడం, అప్పులు తీర్చేమార్గం కానరాకపోవడంతో కుటుంబ సభ్యులతో తరచూ మథనపడేవాడు. అప్పులు చెల్లించడానికి మరిన్ని అప్పులు చేయాల్సి వచ్చింది. దీంతో అప్పులు చెల్లించలేనని, బిడ్డలను వృద్ధిలోకి తేలేనని భావించి, ఇంటిలో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కొంత సమయం తర్వాత కుటుంబసభ్యులు గమనించి ఉరికి వేలాడుతున్న చంద్రశేఖర్‌ను కిందికి దింపారు. అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. భార్య అశ్వినీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

దోమ పోటు ఉధృతి



దోమపోటుతో ఎర్రబారిన వరి పంట

చిలమత్తూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలో సాగు చేసిన వరి పంటకు దోమ పోటు ఉధృతి పెరిగింది. మండలంలోని కోడూరు, సోమఘట్ట, కొడికొండ, నల్లబొమ్మనపల్లి, వీరాపురం, దేమకేతేపల్లి, కొర్లకుంట, గొళ్లపల్లి, పాతచామలపల్లి, కొత్తచామలపల్లి చెరువుల ఆధారంగా 295 ఎకరాలు వరకు వరి సాగవుతోంది. ఈ తరుణంలో వరి పంటపై పచ్చదోమపోటు పడింది. నాట్లు వేసిన తరువాత కొత్తచిగురుపై దోమలు రసం పీల్చి వేస్తుండటంతో పైర్లు ఎర్రబారుతున్నాయి. దీంతో అక్కడక్కడ పంట ఎదుగుదలలో హెచ్చుతగ్గులు వస్తున్నాయి. దోమ పోటు నుంచి పంటను కాపాడుకోవడానికి ప్రతి రైతు రసాయనిక మందులను పిచికారీ చేయాల్సి వస్తోంది. ఎకరానికి సస్యరక్షణ చర్యలకు రూ. 1500 నుంచి రూ. రెండు వేల వరకు ఖర్చు వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై వ్యవసాయాధికారి వంశీకృష్ణను వివరణ కోరగా ప్రస్తుతం వరి పంటపై అక్కడక్కడ పచ్చదోమ, జింక్ లోపం కనిపిస్తోందన్నారు. పచ్చ దోమ పోటు నివారణకు మడుల్లో ఎప్పటికప్పుడు పాత నీటిని వదిలేసి కొత్తనీటిని పెట్టాలన్నారు. దాంతో దోమలు వృద్ధి చెందకుండా ఉంటా యన్నారు. దోమ నివారణకు ట్రోనిక్ కామిడ్ 50 శాతం మందుని ఎకరానికి 80 గ్రాములు పిచికారీ చేసుకోవాలన్నారు. పంటలో అక్కడక్కడ జింక్ లోపం ఎక్కువగా కనిపిస్తోందన్నారు. దాంతో పైర్ల ఆకులు ఎర్రబారి మచ్చలు వస్తున్నాయన్నారు. దీని నివారణకు ఎకరానికి 20 కిలోల జింక్‌ని పిచికారీ చేసుకోవాలన్నారు. రైతులు ఎక్కువగా కాంప్లెక్స్ ఎరువులు వినియోగిస్తారని, దాంతో పంటకు కావాల్సిన పొటాషియం దక్కడం లేదన్నారు. అదే విధంగా జింక్ లోపం కూడా ఎక్కువగా కనపడతోందని, వీటి కోసం పంటకు పొటాషియం, జింక్ సల్ఫేటును ప్రత్యేకంగా వాడాలన్నారు.

అనంతను ఆదర్శంగా నిలుపుదాం

ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

26 మందికి ఉత్తమ డ్రైవర్ అవార్డులు



అవార్డులను అందుకున్న డ్రైవర్లతో ముఖ్య అతిథులు, ఆర్టీసీ అధికారులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణలో అనంతపురం జిల్లాను ఆదర్శంగా నిలుపుదామని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పిలుపునిచ్చారు. అనంతపురం డిపో ఆవరణలో శనివారం సాయంత్రం రీజనల్ మేనేజర్ సుమంత్ అధ్యక్షతన రోడ్డుభద్రతా వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కు పూల నాగరాజు, అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్టీఓ సురేష్‌నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ... రాష్ట్రంలో ఏడాదికి దాదాపు 8వేల మంది రోడ్డు ప్రమాదాల కారణంగా మృతి చెందుతుండగా 25వేల మందికి పైగా గాయపడుతున్నారన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో ఆర్టీసీ బస్సు ప్రమాదాలు చాలా తక్కువని, దీనికి డ్రైవర్లకు ఆర్టీసీ ఇచ్చే శిక్షణే కారణమన్నారు. రోడ్డుభద్రతా నియమాలను తూచా తప్పకుండా పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయన్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకీ వాహనాల సంఖ్య పెరుగుతోందని, వాహనాల సంఖ్యతోపాటు ప్రమాదాలు పెరిగే అవకాశముందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తత వహిస్తే తప్ప ప్రమాదాలను నివారించలేమన్నారు. కార్యక్రమంలో పీఓ చెంద్రాయుడు, డిప్యూటీ సీటీఎం శ్రీలక్ష్మి, అనంతపురం డిపో మేనేజర్ నాగభూపాల్, రీజియన్‌లోని అన్ని డిపోల డీఎంలు, బస్టాండు మేనేజర్ కేవీన్ మూర్తి, ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డులు పొందిన డ్రైవర్లు వీరే...

జోనల్ స్థాయిలో..:	ఎం.ప్రసాద్ (తాడిపత్రి), జీకే మొహిద్దీన్ (అనంతపురం)
రీజియన్ స్థాయిలో.. :	కేవీ రాముడు(తాడిపత్రి), బీఆర్ ఆంజనేయులు(అనంతపురం), జి.వెంకటేష్(కళ్యాణదుర్గం)

డిపోలవారీగా..

డిపో పేరు	డ్రైవర్ పేరు
అనంతపురం	ఎస్ఎం బాషా, జేఎస్ రాములు, కేఐ సాహెబ్
గుత్తి	కె.రాజు, ఎంఆర్ గోపాల్, ఎస్ రహిమాన్
గుంతకల్లు	బి.బాలస్వామి, హెచ్‌కే పీరా, వైకే మూర్తి
కళ్యాణదుర్గం	టీవీ రమణ, ఎస్ఆర్ క్రిష్ణ, బీఎస్ఆర్ రెడ్డి
రాయదుర్గం	వి. శేఖర్, డీజీ నాయక్, పి. రామాంజిని
తాడిపత్రి	డి. మోహన్, పి తిరుపతయ్య, ఎంబీ నారాయణ
ఉరవకొండ	ఎ. వెంకటేశులు, యం.రామదాస్, ఎంసీ రంగస్వామి

భక్తి శ్రద్ధలతో మహాభోగ్

ముగిసిన సేవాలాల్ జయంత్యుత్సవాలు



అలంకరణలో సేవాలాల్ మహరాజ్



ఎంపీ అంబికా, కలెక్టర్‌ను సన్మానిస్తున్న ట్రస్టు సభ్యులు



మహాభోగ్ కార్యక్రమం నిర్వహిస్తూ..

గుత్తి రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సేవాలాల్ జయంత్యుత్సవాలు శనివారం ముగిశాయి. స్వామివారికి శనివారం వేకువజామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకిలో కొలువుదీర్చి ఊరేగించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన సేవాలాల్ మాలధారులు ఇరుముడులను సమర్పించారు. మాతాజగదాంబ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయం నుంచి 101 మంది యువతులు బోనాలను తీసుకువెళ్లి సేవాలాల్ మహరాజ్‌కు సమర్పించారు. పీఠాధిపతి రాజేంద్ర ప్రసాద్ గురూజీ నేతృత్వంలో ముగింపు ఉత్సవాల్లో అత్యంత కీలకమైన మహాభోగ్‌ను బంజారాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ చివరి రోజు వేడుకలలో పాల్గొన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసిన అధికారులను అభినందించారు. సేవాలాల్ మహరాజ్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు, ఉపాధ్యక్షులు కేశవనాయక్, రవీంద్ర నాయక్, సభ్యులు అశ్వత్థనాయక్, ఎకే రామచంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇరుముడి తీసుకెళుతున్న మాలధారులు



ఆడుతాం.. పాడుతాం..!

బాలోత్సవాలలో అదే ఉత్సాహం

ఆహూతులను కట్టిపడేసిన ప్రదర్శనలు



మాయమైపోలేదు.. జానపదం..





ఉత్తమం.. ఉమ్మడి కుటుంబం

వెయ్.. చిందెయ్..



రెండు కళ్లనూ కట్టిపడేసేలా...







పోలా.. అదిరిపోలా..



అమ్మోరు తల్లో...



రంగు రంగుల వేషధారణలు..







భోజనం వడ్డిస్తున్న హెచ్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత హనుమంతరెడ్డి, సీపీఎం రాష్ట్ర నాయకుడు రాంభూపాల్, జిల్లా కార్యదర్శి నల్లప్ప తదితరులు

బాలోత్సవాలలో రెండో రోజు అదే ఉత్సాహం కొనసాగింది. లలితకళా పరిషత్, గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ ప్రాంగణాలలో వందలాది మంది బాలలు శనివారం రెండో రోజు ఆటపాటలతో అలరించారు. అలుపు సొలుపు లేకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటాపోటీగా నృత్య, నాటక ప్రదర్శనలు ఇచ్చారు. ఏకపాత్రాభినయాలు, షార్ట్‌ఫిల్మ్ విశ్లేషణలు ఆలోచింపజేశాయి. వ్యాస రచన, మ్యాప్, వక్తృత్వ, క్విజ్ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్సవాలను తిలకించేందుకు నగరవాసులు తరలివచ్చారు. ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫివుల్లా అధ్యక్షతన కెనరాబ్యాంకు రీజనల్ ఏజీయం లారెన్స్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతిభ చాటిన బాలలకు అతిథులు బహుమతులను అందజేశారు. వేడుకలలో పాల్గొన్న సుమారు 2,500 మందికి హెచ్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత హెచ్ హనుమంతరెడ్డి భోజనం సమకూర్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు రాంభూపాల్, జిల్లా కార్యదర్శి నల్లప్ప, బాలోత్సవ కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి ఐద్వా సావిత్రితో ఆయన చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు భోజనం వడ్డించారు. చిన్నారులకు ఆనందాన్ని కలిగించే ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని, తమవంతు సహకారం అందిస్తామని హనుమంతరెడ్డి అన్నారు.

– ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్, క్లాక్ టవర్





పాత్ర ఏదైనా.. జీవించేస్తాం..

దానిమ్మ రైతుకు ధరల పంట..!



రూ.1.40 లక్షల వరకు పలుకుతున్న టన్ను

తోటల వద్దే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

అన్నదాతల్లో ఆనందం



మర్తాడులో సాగుచేసిన దానిమ్మ తోట

దానిమ్మ రైతు ఇంట ధరల పంట పండింది. అనూహ్య ధరలతో అన్నదాతపై సిరుల వర్షం కురుస్తోంది. టన్ను ఏకంగా రూ.1.40 లక్షల వరకు ధర పలుకుతుండడంతో రైతులు లక్షాధికారులవుతున్నారు. తోటల వద్దకే వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తుండడంతో అన్నదాతల ఆనందానికి అవధుల్లేవు. అప్పుల నుంచి బయటపడతామని సంబర పడుతున్నారు.

– ఆంధ్రజ్యోతి, గార్లదిన్నె

కష్టాలు తీరినట్లే



ప్రస్తుతం టన్ను దానిమ్మ రూ.1.40 లక్షల వరకు ధర పలుకుతోంది. ఇది ఇలాగే ఉంటే రైతుల కష్టాలు తీరి నట్లే. ఏడెకరాల్లో దానిమ్మ సాగుచేశా. ఎకరాకు రూ.60వేల వరకు పెట్టుబడి పెట్టా. గతేడాది పెద్దగా ధర లేదు. ఈసారి ఆశించిన స్థాయిలో దిగుబడి రావడంతోపాటు గిట్టుబాటు ధర కూడా దక్కుతోంది. విజయవాడ, చెన్నై ప్రాంతాలకు చెందిన వ్యాపారులు.. తోటల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. 40 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. తోటలోనే టన్ను రూ.1.40 లక్షలకు అమ్మేశా.

– ఆవుల రామకృష్ణ, రైతు, మర్తాడు

పెరిగిన దానిమ్మ సాగు



మర్తాడులో కోసిన దానిమ్మ పండ్లు

గార్లదిన్నె అంటేనే టక్కున గుర్తుకొచ్చేది చీనీ సాగు. రాష్ట్రంలోనే చీనీ సాగుకు మండలం ప్రత్యేక గుర్తింపు పొందింది. మండల రైతులు మాత్రం రెండేళ్లుగా దానిమ్మ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. గార్లదిన్నె, మర్తాడు, ముకుందాపురం, యర్రగుంట్ల, జంబులదిన్నె, తిమ్మంపేట, కొప్పలకొండ తదితర గ్రామాల్లో రైతులు దానిమ్మ పంట పెడుతున్నారు. మండలవ్యాప్తంగా సుమారు 500 ఎకరాల్లో సాగు చేశారు. ఇందులో సగానికి పైగా పంట దిగుబడి వస్తున్నట్లు తెలుస్తోంది. పదిరోజుల క్రితం వరకు టన్ను రూ.80వేల నుంచి రూ.90వేల వరకు ధర ఉండేది. ప్రస్తుతం ఆ ధర మరింత పెరిగింది. ప్రస్తుతం టన్ను రూ.1.40 లక్షల వరకు పలుకుతోంది.

తోటల వద్దకే వ్యాపారులు..

గతంలో దిగుబడులు ఆశాజనకంగా వచ్చినా ధరలు లేకపోవడంతో పంటను విక్రయించుకోవడానికి రైతులు ఇబ్బందులు పడేవారు. వ్యాపారుల వద్దకు వెళ్లేవారు. దీంతో రైతులకు మార్కెటింగ్, రవాణా ఖర్చులు తడిసి మోపెడయ్యేవి. ప్రస్తుతం మార్కెట్‌లో దానిమ్మకు ధర ఉండడంతో వ్యాపారులే.. రైతుల వద్దకు వస్తున్నారు. కాయలు నాణ్యతగా, సైజు బాగా ఉంటే రైతుల పంట పండినట్లే. రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక, కోయంబత్తూరు తదితర ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో దానిమ్మ దిగుబడి తగ్గిపోయింది. జిల్లాలో ఈ ఏడాది దానిమ్మకు వైరస్ సోకలేదు. అక్కడక్కడా సోకినా రైతులు కాపాడుకున్నారు. మేలైన దిగుబడులు సాధించారు. ధర కూడా ఆశాజనకంగా ఉంది. ధరలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక్కడ పండే దానిమ్మ విజయవాడతోపాటు చెన్నై, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు.



వ్యాపారులే వస్తున్నారు

ప్రస్తుతం దానిమ్మ సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. దానిమ్మ చెట్లకు ఎక్కువగా బ్యాక్టీరియా సోకుతుంది. కంటికి రెప్పలా కాపాడుకోవాలి. గతంలో పంటను విక్రయించేందుకు చాలా ఇబ్బందులు పడేవారం. ప్రస్తుతం డిమాండ్ ఉండడంతో వ్యాపారులే తోటల వద్దకు వస్తున్నారు.

– తిరుపతిరెడ్డి, గార్లదిన్నె

ధర నేలచూపు.. ధాన్యం గోదాము వైపు..!

- పప్పుశనగకు దక్కని గిట్టుబాటు రేటు
- నష్టానికి అమ్ముకోలేకపోతున్న అన్నదాత
- ధాన్యమంతా గోదాములకు తరలిస్తున్న దుస్థితి



తగ్గుపర్తిలో పప్పుశనగను గ్రేడింగ్ చేసి తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతులు

పప్పుశనగ ధర నేలచూపులు చూస్తోంది. తక్కువ ధరకు అమ్ముకోలేక అన్నదాతలు దిక్కులు చూస్తున్నారు. క్వింటా పప్పుశనగ ధర రూ.6 వేల లోపే పలుకుతోంది. చేసేదిలేక రైతులు పండించిన పంట అంతా గోదాములకు తరలిస్తున్నారు. అప్పులు చేసి.. రైతులు పెట్టుబడులు పెట్టారు. పంట పండినా అమ్ముకోలేని పరిస్థితి దాపురించింది. దీంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

బెళుగుప్ప, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లరేగడి భూముల రైతులకు పప్పుశనగ పంట జీవనాధారం. మండలవ్యాప్తంగా రబీలో 16,600 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశారు. ఎకరాకు రూ.16వేల వరకు పెట్టుబడి పెట్టారు. తెగుళ్ల నివారణకు అధిక మొత్తంలో ఖర్చు చేశారు. దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. ఎకరాకు ఐదారు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కష్టాల నుంచి కొంతమేర ఉపశమనం లభిస్తుందని అన్నదాతలు ఆశించారు. వారికి ధరల విపత్తు ఎదురైంది. ఈసారి ధరలు పాతాళానికి పడిపోయాయి. క్వింటా రూ.6వేలు కూడా పలకట్లేదు. ఆ ధరకు విక్రయిస్తే గిట్టుబాటు కాదని అన్నదాతలు వాపోతున్నారు. ఇళ్లలో నిల్వ ఉంచుకుంటే పురుగు పడుతోంది. చేసేదిలేక రైతులు అద్దెలు చెల్లించి, గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నారు. ధర పెరిగితేనే గట్టెక్కుతామనీ, అప్పటివరకు ఎదురుచూపులు తప్పవని అన్నదాతలు అంటున్నారు.

ఏడాదికేడాదికీ తగ్గుముఖం

పప్పుశనగ ధరలు తగ్గుతూ వస్తున్నాయి. మూడేళ్ల క్రితం క్వింటా పప్పుశనగ ధర రూ.పదివేలు పలికింది. గతేడాది రూ.8 వేలకు తగ్గింది. ప్రస్తుతం రూ.ఆరువేల లోపే పలుకుతోంది. ఈ ఏడాది కాస్తో.. కూస్తో.. దిగుబడి వచ్చినా ధర లేదు. ఏటా ధరలు తగ్గుముఖం పడుతుండటంతో కోలుకోలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



గోదాములోకి చేర్చుతున్న హమాలీలు.. నిల్వ ఉంచిన పప్పుశనగ

గిట్టుబాటు ధర వస్తేనే గట్టెక్కగలం



30 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశా. రూ.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. 150 క్వింటాళ్లకుపైగా దిగుబడి వచ్చింది. కష్టాలు తీరతాయనుకున్నా. ధరల్లేక అల్లాడుతున్నాం. గోదాము అద్దె భారమైనా తప్పని పరిస్థితుల్లో అందులో నిల్వ చేస్తున్నాం. క్వింటా రూ.8 వేలు ధర పలికితేనే గట్టెక్కగలం.

– కిష్టయ్య, రైతు, తగ్గుపర్తి

రూ.8 వేలతో కొన్నాం.. రూ.5,500తో విక్రయం



40 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశా. 200 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. విక్రయిద్దామంటే ధరల్లేవు. పంట సాగు సమయంలో పప్పుశనగ విత్తనాన్ని రూ.8 వేలతో కొనుగోలు చేశాం. ఇప్పుడేమో రూ.5500లోపే ధర ఉంది. ఈ ధరకు విక్రయించుకోలేక గోదాములో నిల్వ ఉంచాం.

– రుద్రయ్య, రైతు, ఎర్రగుడి

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

పప్పుశనగ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– పృథ్వీసాగర్, ఏఓ, బెళుగుప్ప

జాతకం బాగలేదు..!

ఆ నలుగురి జాతకం బాగలేనట్లుంది. జాతకం చెప్పే వ్యక్తిని నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి బెదిరించి.. దోచుకుని దొరికిపోయారు.


కుళ్లాయప్ప

హిందూపురం టూటౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి సీఐ జనార్దన్ తెలిపిన మేరకు, పామిడికి చెందిన కుళ్లాయప్ప ఊరూరా బైక్‌పై తిరుగుతూ జాతకం చెబుతుంటాడు. ఈ క్రమంలో శనివారం హిందూపురం పరిధిలోని సడ్లపల్లికి వచ్చాడు. వీధుల్లో తిరుగుతుండగా.. నాగరాజు, వెంకటేశ్, శివకుమార్, గంగాధర్ అనే నలుగురు జాతకం చెప్పించుకునే పేరిట ఊరి చివరకు తీసుకెళ్లారు. ముళ్ల పొదల్లోకి లాక్కెళ్లి దాడిచేశారు. తప్పుడు జ్యోతిష్యం చెబుతున్నావా అని నిలదీశారు. రూ.లక్ష ఇవ్వాలని, లేదంటే చంపేస్తామని బెదిరించారు. తనవద్ద అంత డబ్బు లేదని బతిమాలినా వినిపించుకోలేదు. దీంతో కుళ్లాయప్ప తన బంధువులకు ఫోన్ చేసి, వారి చేత రూ.30వేలు ఫోన్‌పే చేయించాడు. ఆ తరువాత వదిలేశారు. బాధితుడు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఫోన్‌పే నంబరు ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.

- హిందూపురం, ఆంధ్రజ్యోతి

గౌతమిపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి


క్లాక్‌టవర్ వద్ద నిరసన తెలుపుతున్న ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లిలో గౌతమిపై యాసిడ్ దాడిచేసి, కత్తితో పొడిచిన గణేష్‌ను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి డిమాండ్ చేశారు. గౌతమిపై దాడిని నిరసిస్తూ శనివారం ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ సంయుక్త ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ వద్ద నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై సమగ్ర విచారణ చేయడంతోపాటు దాడులను అరికట్టాలన్నారు. ఇటీవల మహిళలు, విద్యార్థినులపై ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌తోపాటు హత్యాచారాలు తీవ్రంగా పెరిగాయన్నారు. వీటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించి కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దు, ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, ఉపాధ్యక్షుడు గిరి, సహాయ కార్యదర్శి శివ, సోము, ఐద్వా నగర అధ్యక్ష కార్యదర్శులు చంద్రిక, అశ్విని, రేణుక తదితరులు పాల్గొన్నారు.

జీడిపల్లికి ఇన్‌ఫ్లో 781 క్యూసెక్కులు

బెళుగుప్ప, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 781 క్యూసెక్కులున్నట్లు శనివారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 647 క్యూసెక్కులు, 36వ ప్యాకేజీ కింద 100 క్యూసెక్కులు వెళుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

టమోటా కిలో రూ.7

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 7తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 450 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 5, కనిష్ఠ ధర రూ. 4 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ. 20వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 21,100 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 3,500, సరాసరి రూ. 14వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 51 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

జిల్లాలో జీబీఎస్ కేసుల్లేవ్: డీఎంహెచ్ఓ

అనంతపురంటౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జీబీఎస్ వైరస్ కేసులు లేవని డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి తెలిపారు. జీబీఎస్ వైరస్ కేసుల గురించి శనివారం ఆమె మీడియాతో ముచ్చటించారు. జిల్లాలో ఇప్పటికే క్యాన్సర్‌తోపాటు వివిధ వ్యాధులకు సంబంధించి వైద్య సిబ్బంది స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇదే సమయంలోనే జీబీఎస్ వైరస్ లక్షణాలు ఉన్నవారుంటే గుర్తిస్తామన్నారు. జీబీఎస్ వైరస్ కేసుల విషయంగా జిల్లా వైద్యశాఖ అప్రమత్తంగా ఉందన్నారు. డాక్టర్లు, సిబ్బందికి అలాంటి కేసులు విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం చేయకుండా తగిన సమాచారం ఇచ్చి అవసరమైన వైద్యసేవలు అందేలా చూడాలని ఆదేశించినట్లు తెలిపారు. జీజీహెచ్, సూపర్‌స్పెషాలిటీ వైద్యాధికారులు, డాక్టర్లతో దీనిపై చర్చించి ముందస్తు చర్యలకు ఆలోచిస్తున్నామన్నారు. కేసులు లేకపోవడంతో జిల్లాకు ఇంతవరకు ఆ వైరస్‌కు వినియోగించే ఇమ్యూనోగ్లోబ్యులిన్ ఇంజెక్షన్‌లు రాలేదన్నారు. అ ఇది అంటువ్యాధి కాదని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని డీఎంహెచ్ఓ అన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడి మృతి


హరికృష్ణ (ఫైల్)

రామగిరి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని శేషంపల్లి గ్రామానికి చెందిన హరికృష్ణ(30) శనివారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తాపడి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు....శేషంపల్లి గ్రామానికి చెందిన హరికృష్ణ శనివారం మధ్యాహ్నం ట్రాక్టర్‌లో వ్యవసాయ పనుల నిమిత్తం తోటకు వెళ్లాడు. అక్కడ ట్రాక్టర్ బోల్తా పడటంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. హరికృష్ణను స్థానికులు అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రామగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య వరలక్ష్మి ఉన్నారు. వీరికి సంతానం లేదు. టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య సంఘటనా స్థలానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఇగుడూరులో చోరీ

తాడిపత్రి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇగుడూరు గ్రామంలో శనివారం మధ్యాహ్నం పుష్పావతి ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు ఎస్ఐ కాటయ్య తెలిపారు. ఆయన తెలిపిన మేరకు పుష్పావతి బంధువుల ఫంక్షన్ ఉన్నందున నార్పల మండలం కర్నపొడి గ్రామానికి వెళ్లారు. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఇంటిపైనుంచి దుండగులు చొరబడి బీరువాను పగలగొట్టి వాటిలో ఉన్న హుండీలు రెండు ఎత్తుకెళ్లారని వారు తెలిపారు. దాదాపు రూ.1.30లక్షలు ఉంటుందని వారు అంచనా వేశారు. అనంతరం క్లూస్‌టీం రప్పించి ఫింగర్‌ప్రింట్ నమూనాలను సేకరించారు. కేసు నమోదు చేశామని, త్వరలో దొంగను పట్టుకుంటామని ఆయన తెలిపారు.


బీరువాను పగలగొట్టడంతో చెల్లాచెదురుగా పడ్డ వస్తువులు

జంక్‌ఫుడ్‌తో జరభద్రం..!

చిన్నారులు, యువత ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

- అరికట్టకపోతే రక్తహీనత, ఊబకాయం
- ప్రమాదకరమంటున్న వైద్యులు
- ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలను పట్టించుకోని అధికారులు

మద్యపానం, ధూమపానం ఆరోగ్యానికి ఎంత హానికరమో.. ప్రస్తుతం జంక్‌ఫుడ్ కూడా అంతే ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. జంక్‌ఫుడ్ నుంచి పిల్లలను రక్షించాలంటూ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిబంధనల్ని జారీ చేసింది. ఆల్కహాల్ వంటివి చేసే నష్టం కంటే జంక్‌ఫుడ్ ఇంకా ప్రమాదకరమని స్పష్టం చేసింది.



ధర్మవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): జంక్‌ఫుడ్ తినే వారి సంఖ్య రోజురోజుకూ అధికమవుతోందని, వాటి నియంత్రణలో కఠిన చర్యలు చేపట్టకపోతే అనారోగ్య భారత్‌ను చూడవలసి వస్తుందని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆందోళన వ్యక్తం చేసింది. ప్యాకింగ్ ఫుడ్‌లో అతి ప్రమాదకరంగా ఉండే రసాయనాలను నిషేధించింది. కానీ జంక్‌ఫుడ్ తయారీదారులు వాటిని వాడుతూనే ఉన్నారు. ఇవి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా ప్రొపైల్‌గాలెట్, పొటాషియం, గ్లూటామెట్ వంటి రసాయాలపై నిషేధం విధించింది. కానీ జంక్‌ఫుడ్ తయారీదారులు వీటిని యథేచ్ఛగా వాడుతున్నారు. అధిక తీపిని ఇచ్చే హైఫ్రక్టోజ్ కార్న్‌సిరప్ రసాయనాన్ని వినియోగించకూడదని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు జారీ చేసింది. దీని వల్ల షుగర్, కిడ్నీ సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొంది. వీటిని కూడా అధికంగా వాడేస్తున్నారు. పిల్లల చదువుపై దృష్టి పెట్టినట్లే వారి తిండిపై కూడా తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచాలని, జంక్‌ఫుడ్ ప్రభావం జీవితాంతం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

రక్తహీనత, ఊబకాయం

జంక్‌ఫుడ్ కారణంగా బాలికల్లో రక్తహీనత, బాలురలో ఊబకాయం పెరుగుతోంది. కొంత మంది బాలురు సరిగ్గా ఆహారం తినకపోయినా లావుగా ఉంటారు. దీనికి కారణం శరీరంలో జంక్‌ఫుడ్ వ్యర్థాలు పేరుకుపోవడమే. బాలికల్లో జంక్‌ఫుడ్ కారణంగా సరైన సమయంలో పీరియడ్స్ రాకపోవడం, నరాలు, నొప్పులు కంటి చూపు తగ్గడం వంటి సమస్యలు తలెత్తున్నాయి.

తల్లిదండ్రులే జాగ్రత్త పడాలి

ఆరోగ్యం పట్ల ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటాయని అనుకోవడం కన్నా వీటి ప్రభావం నుంచి రక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రుల పైనే ఉంది. దీనికి తోడు పిల్లలు అందుబాటులో ఉండే ఆహారాన్నే తింటుంటారు. వారికి అందుబాటులో ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉంచే బాధ్యతను కూడా తల్లిదండ్రులు చూసుకోవాలి. జంక్‌ఫుడ్ శరీరంలో పేరుకుపోవడంతో పాటు నాడీ, జీర్ణవ్యవస్థలు, మెదడు, గుండెపోటుతో పాటు 18 రకాల అవయవాల పనితీరుపై ప్రభావం చూపుతుందని నిపుణులు అంటున్నారు.

చిన్నారులకు అందాల్సినవి..

7-10 మధ్య వయసు కలిగిన అబ్బాయిలకు 77 గ్రాములు, 13-14 ఏళ్ల మధ్య ఉన్న వారికి 86 గ్రాములు కొవ్వు పదార్థాలు ఉండే ఆహారాన్ని అందించాలి. అమ్మాయిలకు 68 గ్రాములు, 79 గ్రాములు అందించాలి. 14 సంవత్సరాల లోపు వరకు అమ్మాయిలకు, అబ్బాయిలకు గాని 170-250 గ్రాముల కార్బోహైడ్రేట్లు ఆహారంలో ఉండాలి. ఉడికించిన ఆహార పదార్థాలయినా అధిక ఉప్పు, కారం, నూనె లేకుండా చూడాలి. పాలు, గుడ్లతో పాటు ప్రతి రెండు రోజులకు ఒకసారి మాంసాహారాన్ని అందించాలి.

పేరుకుపోతున్న వ్యర్థాలు

ఫాస్ట్‌ఫుడ్, ఇతర ఆహారం వల్ల నేటి తరంలో అన్ని వయసుల వారి పొట్టలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయని నిపుణులు చెబుతున్నారు. చిన్న పిల్లలు సరాసరిన రోజుకు 30 నుంచి 50 గ్రాముల వరకు చాక్లెట్లను తింటున్నారని అంచనా. ఈ కారణంగా ఆయా వయసుల వారీగా ప్రతి ఒక్కరిలోనూ 30 గ్రాముల నుంచి 100 గ్రాముల వరకు వ్యర్థాలు ఉంటున్నాయి. వీటి ప్రభావం ఎముకల ఎదుగుదల, మనిషి పెరుగుదలపై ఉంటుంది. జంక్‌ఫుడ్‌లో వాడే మైదా, నూనెవంటి వాటితో విష, కొంకి, బద్దెపురుగులు, ఏలికపాములు వంటివి శరీరంలోకి చేరుతున్నాయి. పిల్లల ఎదుగుదలపై ఇవి ప్రభావం చూపుతాయి.



ఎఫ్ఎస్ఎస్ఏఐ మార్గదర్శకాలు

పాఠశాలలకు, విద్యార్థుల వసతి గృహాలకు 50 మీటర్ల వరకు చిరుతిళ్ల దుకాణాలపై ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధం విధించింది. ఈమేరకు పలు మార్గదర్శకాలను విడుదల చేసింది. పిల్లలకు ఇచ్చే స్నాక్స్ బాక్స్‌లలో సాధ్యమైనంతవరకు ఫ్రూట్ సలాడ్‌లు, పల్లీలు, బెల్లంతో చేసిన చిక్కీలు, లడ్డూలు, రాగులు, జొన్నలు, సజ్జలతో తయారుచేసే వంటకాలు ఉండేలా చూడాలి. ఒక్కసారి తింటే ఏమవుతుందని జంక్‌ఫుడ్ విషయంలో తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించకూడదు. పిల్లలు రోజూ తినే ఆహారంలో 300 గ్రాముల కూరగాయలు, వీటిలో ఆకుకూరలు 50 గ్రాములు, దుంపలు 50 గ్రాములు ఉండేలా చూసుకోవాలి. దుకాణాల్లో అమ్మే చిరుతిళ్లపై ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీలను నిర్వహిస్తు ఉండాలి.

జంక్‌ఫుడ్ తినడం ప్రమాదకరం



జంక్‌ఫుడ్ తినడం ప్రమాదకరం. ముఖ్యంగా చిన్నపిల్లలు జంక్‌ఫుడ్ తినడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. పిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపుతాయి. పానీపూరి, పిజ్జాలు, బర్గర్లు, నూడుల్స్, గోబీ, కేకులు తినేవారికి భవిష్యత్తులో సమస్యలు ఎదురవుతాయి. పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. ఆహారపు అలవాట్లు పూర్తిగా మార్చుకోవాలి. ఇంటిలో వండే వాటినే తినాలి. అలాగే పండ్లు, మాంసాహారం తీసుకోవాలి.

- డాక్టర్ నజీర్, ప్రభుత్వ వైద్యుడు, ధర్మవరం

కాంప్లెక్స్ మీటింగ్ కష్టాలు...!

ఇబ్బందులు పడ్డ ఉపాధ్యాయులు


కళ్యాణదుర్గం మండలం గోళ్ల జడ్పీహైస్కూల్‌లో 5.30 గంటల తర్వాత అటెండెన్స్ వేయడానికి ఇబ్బందులు పడుతున్న టీచర్లు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ నిర్వహించిన క్లస్టర్ కాంప్లెక్స్ మీటింగ్‌లపై ఉపాధ్యాయులు పెదవి విరిచారు. శనివారం నిర్వహించిన ఈ మీటింగ్‌లపై మెజార్టీ టీచర్లు, సంఘాల నేతల నుంచి అసహనం వ్యక్తమైంది. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల్లో మీటింగ్స్‌కు హాజరైన ఉపాధ్యాయులు హాజరు యాప్ లాక్ వల్ల ఇబ్బంది పడ్డారు. మడకశిర, రాయదుర్గం తదితర సుదూర ప్రాంతాల్లో పని చేసే టీచర్లు మీటింగ్ పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణమయ్యేందుకు చాలా ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా మీటింగ్ ముగింపు సమయం 5 గంటలకే ఉన్నా... 5.30 గంటలు, 6 గంటల వరకూ అటెండెన్స్ పడకుండా లాక్ చేయడంపై ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సాయంత్రం అటెండెన్స్ పడక 6 గంటల వరకూ మీటింగ్ ప్రాంతాల్లోనే ఉన్నామని, తర్వాత సుదూర ప్రాంతాల నుంచి తిరుగు ప్రయాణమ య్యేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు వాపోయారు.

పెదవి విరిచిన సంఘాల నేతలు

ప్రభుత్వాలు మారినా....విద్యారంగంపై అధికారుల పెత్తనం మారలేదంటూ ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గౌనిపాతిరెడ్డి పెదవి విరిచారు. కాంప్లెక్స్ మీటింగ్స్ సమయాన్ని మార్చాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి రామాంజనేయులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. క్లస్టర్ కాంప్లెక్స్ క్లోజింగ్ అటెండెన్స్ లాక్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సిరాజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. మీటింగ్ తర్వాత చాలా మంది టీచర్లు యాప్‌లో హాజరు పడక అనేక ఇబ్బందులు పడ్డారని, 6 గంటల వరకూ ఎదురు చూశారని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య, ప్రధానకార్యదర్శి రవీంద్ర ప్రకటనలో అసహనం వ్యక్తం చేశారు.

బాధ్యతల స్వీకరణ


ఎస్సీ వెల్ఫేర్ ఇన్‌చార్జ్ డీడీ రాధిక

అనంతపురం ప్రెస్ క్లబ్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): ఎస్సీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాధిక బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు శనివారం ఆమె డీడీ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి నుంచి అధికారికంగా బాధ్యతలు తీసుకున్నారు. ఇదివరకూ డీడీగా విధులు నిర్వహిస్తున్న ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి రామాయపట్నం పోర్ట్‌కు డెప్యుటేషన్‌పై వెళ్లగా ఆయన స్థానంలో గుత్తి ఏఎస్‌డబ్ల్యూఓగా విధులు నిర్వహిస్తున్న రాధికకు ఇన్‌చార్జ్ డీడీ బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. దీంతో ఆమెకు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

హంద్రీనీవా లైనింగ్ ఆపాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


మాట్లాడుతున్న రామకృష్ణ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు వెంటనే ఆపాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, అనంతపురం జిల్లా కార్యదర్శి జాఫర్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.... కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో సామాన్య ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. ఆదాయపు పన్ను మినహాయింపుతో మిడిల్ క్లాస్ ఉద్యోగులకు తప్ప ఎవరికీ ప్రయోజనం లేదన్నారు. రైతులు, సామాన్యులకు, కార్మికులకు ఎవరికీ ఎలాంటి ఊరట లభించలేద న్నారు. అందువల్లే వారం రోజులపాటు దేశవ్యాప్తంగా నిరసనలు తెలుపుతూ...ప్రజల్లో చైతన్యం తెస్తున్నామన్నారు. జగదీష్ మాట్లాడుతూ హంద్రీ కాలువ లైనింగ్ పనులను జిల్లా రైతులు వ్యతిరేకిస్తున్నారన్నారు. కాలువను వెడల్పు చేయాలని, 5 వేల క్యూసెక్కులు వచ్చేలా చేయాలన్నారు. లైనింగ్ పనులను రైతులతోపాటు టీడీపీ శాసన సభ్యులు, కార్యకర్తలు కూడా వ్యతిరేకిస్తున్నారన్నారు. జిల్లాలో కబ్జాదారులకు పోలీసులు అండగా నిలుస్తున్నారన్నారు. వీటిపై బాధితులు ఫిర్యాదు చేస్తే కోర్టుకు వెళ్లాలని సూచించడం సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మల్లికార్జున, శ్రీరాములు, లింగమయ్య, కుళ్లాయిస్వామి తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి

హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి



అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని, హైందవ ధర్మాన్ని కాపాడుకోవాలని హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి పేర్కొన్నారు. జిల్లా కేంద్రం ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహా కుంభాభిషేక వేడుకలు రెండో రోజు శనివారం కొనసాగాయి. ఉదయం ఆలయ ఆవరణలో 108 జంటలతో సామూహికంగా గణపతి, నవగ్రహ, లక్ష్మీనారాయణ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. సాయంత్రం హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి హాజరై లక్ష్మీవెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఆయన భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ఎంతోమంది మహనీయులు దేశపర్యటనలు చేసి హిందూ సంప్రదాయాన్ని నలుదిశలా వ్యాపింపజేశారని తెలిపారు. ప్రస్తుత పాశ్చాత్య సంస్కృతి నుంచి మానవాళి బయటపడి, ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని, అపుడే ఇంతటి బిజీ ప్రపంచంలోనూ మానసిక ప్రశాంతతను పొందగలమన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, అర్చకబృందం, భక్తులు పాల్గొన్నారు.

పొలాలను బీళ్లుగా ఉంచవద్దు

- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పొలాలను రైతులు బీళ్లుగా ఉంచకూడదని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. అనంతపురం ఆకాశ వాణి కేంద్రం ఆధ్వర్యంలో శనివారం కిసాన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగు తల్లి విగ్రహానికి కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండిపై వారు జడ్పీ ఆవరణలోని సమావేశపు హాల్ వద్దకు చేరుకున్నారు. అక్కడే ఏర్పాటు చేసిన పలు రకాల స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు తల్లి విగ్రహం నుంచి ఎద్దుల బండిపై రావడం తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తిచేసిందన్నారు. రైతుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రతి గురువారం ఉదయం 7.45 గంటల నుంచి 8.15 గంటల దాకా ఆకాశ వాణి డైరెక్టర్‌తో మాట్లాడి గత ఏడు వారాలుగా అనంత మిత్ర ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ భూ సమస్యలపై ముందుగా స్థానిక సచివాలయాల్లో తగిన ఆధారాలతో ఫిర్యాదు చేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ... కరువు జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆకాశ వాణి కేంద్రం డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, సెంట్రల్ సిల్క్ బోర్డు జేడీ కిరణ్‌కుమార్, పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

న్యూస్ బాక్స్

విద్యార్థులను అభినందించిన డీఈఓ


విద్యార్థికి మెమెంటో అందిస్తున్న డీఈఓ కిష్టప్ప

కొత్తచెరువు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఈఈఎంటీ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన బీఎస్ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థులు శివ, ఓబుళేశు, లలితేశ్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్ప శనివారం అభినందించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ...రాష్ట్రస్థాయిలో జరిగిన పరీక్షల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచిన ఈ విద్యార్థులు సత్యసాయి జిల్లాకు పేరు తీసుకువచ్చారన్నారు. ఆ పాఠశాల హెచ్ఎం రాంప్రసాద్‌ను అభినందించారు. స్మార్ట్‌హెల్మెంట్‌ను రూపొందించిన ఉపాధ్యాయుని విజయభార్గవిని అభినందిచారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించి సన్మానించారు. జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్‌ను కూడా అభినందించారు.

రేపటి నుంచి సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

నల్లమాడ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 17, 18 తేదీల్లో బీసీ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆజాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. 17న అనంతప్రగతి గ్రామీణ బ్యాంక్ కాళసముద్రం పరిధిలోని చారుపల్లి, అనంత ప్రగతి గ్రామీణ బ్యాంక్ రెడ్డిపల్లి పరిధిలో ఎర్రవంకపల్లి, వేళ్లమద్ది, కొండకిందతండా, రెడ్డిపల్లి, పాతబత్తలపల్లి, వంకరకుంటలో దరఖాస్తులు చేసుకున్న 261 మందికి ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10.30కు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. 18న నల్లమాడ అనంత గ్రామీణ బ్యాంక్ పరిధిలోని దొన్నికోట, కురమాల, మసవంకపల్లి, నల్లమాడ, గోపేపల్లి, పెమనకుంటపల్లితండా, కదిరి యూనియన్ బ్యాంక్ పరిధిలోని పులగంపల్లికి చెందిన దరఖాస్తు చేసుకున్న వారు ఉదయం 10.30కు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని అన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన సెట్ తీసుకురావాలన్నారు.

ఆర్సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఆర్సీపీఐ రాష్ట్ర మహాసభలను ఏప్రిల్ 22 నుంచి మూడురోజులపాటు కదిరిలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగన్న పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎన్జీవో హోమ్‌లో మహాసభలపై సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుఅవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఈసభలో చర్చిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలక్రిష్ణ, రవిరాజు, సుగుణమ్మ, అబ్దుల్, ప్రతిభాభారతి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యపై రేపు ఆందోళనలు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సమస్యలపై ఈనెల 17న తలపెట్టిన ఆందోళనను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు వెంకటరమణ, రంగమ్మ పిలుపునిచ్చారు. శనివారం వెంకటసాయి ఐటీఐ వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్‌ను మెయిన్ సెంటర్‌గా మార్పు చేస్తూ జీవో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుళ్లాయప్ప, మణిమాల, నాగమణి, వరలక్ష్మీ, సునితభాయి పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

ధర్మవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ప్రభుత్వమే పక్కాగృహాలు నిర్మించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో సీపీఐ పట్టణ, మండల శాఖ కార్యదర్శుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో మధు మాట్లాడుతూ.. పట్టణంలో, గ్రామాల్లో చాలా మంది పేదలు ఇళ్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమావేశంలో నాయకులు వెంకటనారాయణ, రాజ, లలితమ్మ, లింగమ్మ భవాని, నారాయణమ్మ, శ్రీధర్, ఆదెప్ప, రంగయ్య పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఏఈగా సదాశివం



ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): మండల విద్యుత్‌శాఖ ఏఈగా సదాశివం శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఏఈ రామసూరారెడ్డి ఏడీగా పదోన్నతపై పుట్టపర్తికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పుత్తూరులో పనిచేస్తున్న సదాశివం ఇక్కడికి బదిలీ ఆయ్యారు.

ఇంటిలోని వస్తువుల ధ్వంసం

ధర్మవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేతిరెడ్డికాలనీలో ఉంటున్న శ్రీనివాసులు ఇంటిపై శనివారం కొందరు దాడి చేసి వస్తువులన్నీ ధ్వంసం చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో రెండేళ్ల క్రితమే ఇళ్లు నిర్మించుకున్నానని తెలిపారు. కాలనీకి చెందిన వీరన్న నకిలీ పట్టా సృష్టించి స్థలం తనదని ఇళ్లు ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారన్నారు. దీనిపై కోర్టును కూడా ఆశ్రయించానన్నారు. ఈ క్రమంలో వీరన్న 50 మంది అనుచరులతో ఇంట్లో టీవీ, ఫ్రిజ్, బీరువా, గ్యాస్‌సిలిండర్ ఇతర సామాన్లు బయటకు విసిరేసి బీభత్సం చేశాన్నారు. టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలి

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డికి బోయ సంఘం నాయకులు వినతి పత్రం అందచేశారు. రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం అధ్యక్షుడు బంగారు క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో మండల నాయకులు నాగవేణి, ఆదినారాయణ విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు ప్రమీల, నాగవేణి, శ్రీరాములు, మద్దిలేటి మనోహర్, రామాంజి, వెంటస్వామి పాల్గొన్నారు.

అండర్ డ్రైనేజీ బ్రిడ్జి ఎత్తు పెంచాలని నిరసన

ముదిగుబ్బ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మలకవేమల వద్ద అండర్ డ్రైనేజీ బ్రిడ్జి ఎత్తు పెంచాలని శనివారం గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. మలకవేమల నుంచి ముదిగుబ్బకు చేరుకునేందుకు అండర్ బ్రిడ్జి ఎత్తు తక్కువగా ఉన్నందున రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. అండర్ బ్రిడ్జి ఎత్తు పెంచాలని గ్రామస్థులు కోరారు.


అండర్ డ్రైనేజీ బ్రిడ్జి ఎత్తు పెంచాలని నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

ముందుకు సాగని జలజీవన్ పనులు

● వైసీపీ హయాంలో ముందుకు రాని కాంట్రాక్టర్లు ● ప్రభుత్వ ఆశయానికి గండి ● గ్రామీణులకు చేరని తాగునీటి పథకం

తనకల్లు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిఇంటికి తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జలజీవన్ మిషన్ పథకాన్ని ప్రారంభించాయి. ఈ పథకంలో కేంద్రం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం నిధులు కేటాయించి, అన్ని గ్రామాలకు తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేశారు. గత వైసీపీ పాలనలో మండలంలోని 167 మజరా గ్రామాలను జలజీవన్ మిషన్ పథకానికి ఎంపిక చేశారు. అన్ని గ్రామాలకు కావలసినన్ని నిధులును సమకూర్చ లేదు. అరకొర నిధులతో పథకాన్ని తూతూమంత్రంగా కొనసాగించుమ అనిపించారు. దీంతో గ్రామీణులకు తాగునీటిని అందించాలన్న ఆశయానికి గండిపడింది. కేవలం రూ.20 వేలు, రూ.30వేలు, 50వేలు కేటాయించి జలజీవన్ మిషన్‌తో ఇంటింటికి తాగునీరు ఎలా పూర్తవుతుందో సంబంధిత అధికారులు, అప్పటి వైసీపీ ప్రభుత్వానికే తెలియాలి. మండలంలోని కొన్ని గ్రామాలకు రూ.లక్షల నిధులు కేటాయించినా అప్పటి వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు రావన్న ఉద్దేశ్యంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో చిన్నచిన్న పనులను తూతూమంత్రంగా చేసి, మండలంలోని 50 గ్రామాలకు జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటిని అందిస్తున్నట్లు గొప్పలు చెప్పుకున్నారు. తీరా గ్రామాల్లోకి వెళ్లి పరిశీలిస్తే రెండు, మూడు, లేక నాలుగు కొళాయిలు ఏర్పాటు చేశారు. మరికొన్ని గ్రామాల్లో పైపులైన్ మరమ్మతులు చేసి సరిపెట్టారు. వీటిని లెక్కగట్టి 50 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నట్లు చెప్పుకున్నారు. గ్రామాల్లో పరిస్థితి ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ప్రజలు తాగునీటికోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంలో అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అన్ని గ్రామాలకు, అన్ని ఇళ్లకు తాగునీటిని అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


ట్యాంకర్‌తో నీటిని పట్టుకుంటున్న కొత్తకురువపల్లి గ్రామస్థులు

ఒక్క కొళాయీ ఏర్పాటు చేయలేదు



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల గణాంకాల్లో కొత్తకురవపల్లిలో ఇంటింటికి తాగునీరు అందించినట్లు తెలుస్తోంది. వాస్తవానికి గ్రామంలో ఒక్క ఇంటికి కూడా కొళాయి ఏర్పాటు చేయలేదు. కేవలం పైపులైన్ మరమ్మతులు చేయించి, జలజీవన్ మిషన్ కార్యక్రమాలు పూర్తయిన్నట్లు ప్రకటించడం దారుణం. కూటమి ప్రభుత్వంలోనయినా మా గ్రామంలో ఇంటింటికి తాగునీటిని అందించేలా కృషిచేయాలి.

- సూర్యనారాయణ, కొత్తకురవపల్లి

ఊరంతటికి నాలుగు కొళాయిలు



జలజీవన్ మిషన్‌లో ఇంటింటికి తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కేవలం గ్రామంలో నాలుగు చోట్ల కొళాయిలు వేసి జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి అందిస్తున్నట్లు అధికారులు ప్రకటించడం అన్యాయం. గ్రామంలో 40 కుటుంబాలు ఉండగా ఊరు చివర ఉన్న ఇళ్లకు కొళాయిచ్చి పూర్తయిందనడం సరికాదు. ఇప్పటికైనా అధికారులు ఇంటింటికి కొళాయి ఏర్పాటు చేయాలి.

- రఘునాథ్‌రెడ్డి, వడ్డుమరవపల్లి

నిధుల మేరకే పనులు

మేం ప్రతిపాదనలు పంపకనే ప్రభుత్వం మండలంలోని 167 గ్రామాలను జలజీవన్ మిషన్ కింద ఎంపిక చేసింది. గ్రామానికి రూ.20, 30, 50 వేలు కేటాయించడంతో ఉన్న నిధులతో ఆ పనులు మాత్రమే పూర్తి చేశాం. ప్రభుత్వం 2028 వరకు జలజీవన్ మిషన్ పనులను కొనసాగిస్తుంది.

- కవిత, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్

కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు: ఎమ్మెల్యే

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సమస్యలపై ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రజాగ్రీవెన్స్‌సెల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమస్యలపై ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. వినతులకు వారంలోపు పరిష్కారం చూపాలన్నారు. గ్రీవెన్స్ సెల్‌లో ఎక్కువగా భూవివాదాలు వస్తున్నాయని ఎమ్మెల్యే అధికారులకు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు నడుస్తోందన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 195 చెరువులకు హంద్రీనీవా నీటిని నింపితే ప్రజల తలరాతలు మారుతాయన్నారు. ప్రజాసేవ చేయాలన్న ఆలోచనతో ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. అమడగూరు, నల్లమాడ, ఓడీసీ మండలాల నుంచి 647 వినతులు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ నరేంద్రరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పత్తి చంద్రశేఖర్, తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, ఏఓ ఇలియాజ్‌అహమ్మద్, ఏపీఎం రవీంద్ర, టీడీపీ నాయకులు శెట్టివారి జయచంద్ర, షైలే శివశంకర్, గోపాల్‌రెడ్డి, పిట్టా ఓబులరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఎస్పీ

(న్యూస్ నెట్‌వర్క్- ఆంధ్రజ్యోతి)

మన ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుకుంటామో మన కార్యాలయాలు, పరిసరాలను కూడా అలాగే పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్పీ వి.రత్న పిలుపునిచ్చారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసుకార్యాలయంలో డీపీఓ సిబ్బంది ఏఆర్ పోలీసులతో కలసి ఆవరణమంతా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతిమూడో శనివారం జిల్లాలోని అన్ని సబ్‌డివిజన్‌లలోని పోలీసుస్టేషన్లలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఏఓ సుజాత, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు. కొత్తచెరువు పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డీపీఓ సమత మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే రోగాలు దరి చేరవని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నటరాజ్, ఈఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ధర్మవరంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ కరణం హర్షవర్ధన్ పాల్గొన్నారు. గాండ్లపెంట మండల వ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్‌పై ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, ఈఓఆర్డీ సునిత పాల్గొన్నారు. బుక్కపట్నంలో అధికారుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాబుద్దీన్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కౌసల్యాసాయి, ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. నల్లచెరువు మండలంలోని మందాలవాండ్లపల్లిలో ఇంకుడుగుంతల కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఏపీడీ రమేష్‌బాబు, ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త పాల్గొన్నారు. కస్తూరిబా పాఠశాల లో బాలికలకు చెత్తతో సందప తయారీపై ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, స ర్పంచ్ పంచ రత్నమ్మ అవగాహన కల్పించారు. బత్తలపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహనాయుడు, ఏఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ కిష్టప్ప పాల్గొన్నారు. తాడిమర్రిలో ఉన్నతపాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్ర మంలో డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, ఏపీడీ వెంకటాచలపతి, ఎంపీడీఓ రంగారావు, ఎంఈఓ క్రిష్ణమోహన్, ఏపీఓ సంజీవరెడ్డి పాల్గొన్నారు.


పుట్టపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో చెత్త ఊడుస్తున్న ఎస్పీ రత్న

చీపురు పట్టు.. ఫోజుపెట్టు.. ఫొటో కొట్టు

పుట్టపర్తిరూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమంలో ఫొటోలకు ఫోజు లిచ్చే కార్యక్రమంలా మారింది. పుట్టపర్తి సాయి ఆరామంలో పర్యాటకశాఖ అధికారుల తీరు చీపురు పట్టు.. చెత్త ఊడ్చినట్లుఫోజు పెట్టు.. ఫొటోకొట్టు అన్నట్లు నిర్వహించారు. పర్యాటకశాఖ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి తన ముగ్గురు సిబ్బందితో ఫొటోలు తీసుకుని వెళ్లిపోవడం చూసి ఆశ్చర్యపడటం ప్రజలవంతైంది.



జనజాగృతి ఆధ్వర్యంలో పక్షుల లెక్కింపు


పెద్దపల్లి అడవుల్లో పక్షిజాతి గుర్తింపులో సిబ్బంది

తనకల్లు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపల్లి, సీజీ ప్రాజెక్టు గ్రామాల వద్ద శనివారం జనజాగృతి సంస్థ ఆధ్వర్యంలో వివిధ రకాల పక్షి జాతులను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుతం ఎన్నిజాతులు అంతరించిపోతున్నాయి. ఎన్ని పక్షి జాతులు అభివృద్ధి చెందుతున్నాయన్న విషయాలను తెలుసుకోవడానికి పక్షిజాతుల గుర్తింపు కార్యక్రమం చేపట్టినట్లు జనజాగృతి ఈడీ రాంప్రసాద్ తెలిపారు. డబ్ల్యుడబ్ల్యుఎఫ్ ప్రాజెక్టు ద్వారా పక్షి జాతుల గుర్తింపుపై శిక్షణ నిర్వహించామన్నారు. వేగంగా పెరుగుతున్న కాలుష్యం, అంతరించిపోతున్న అడవులు, నీటి కొరత వల్ల పక్షి జాతులు అంతరించిపోతున్నట్లు చెప్పారు. ఫౌండేషన్ ఫర్ ఎకాలజికల్ సెక్యూరిటీకి చెందిన హేమలత ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

వీర సైనికులకు ఘన నివాళి

ధర్మవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పుల్వామా దాడిలో మృతి చెందిన వీర సైనికులకు స్థానిక ఆదర్శసేవాసంఘం, ఆదర్శపార్కు కమిటీ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం రాత్రి ఆదర్శపార్కులో అమరవీరుల స్థూపం వద్ద కమిటీ సభ్యులు, ప్రజలతో కలిసి దీపాలు వెలిగించి పూలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీర సైనికులను మరవరాదన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, సూర్యప్రకాశ్, గుద్దిటి నాగార్జున, నాగభూషణం, మారుతికుమార్, నాగరాజు పాల్గొన్నారు.


అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులు వెలిగిస్తున్న దృశ్యం

ఆర్టీసీ ప్రయాణమే సురక్షితం: ఎస్పీ

పుట్టపర్తిటౌన్/రూరల్, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ప్రయాణమే సురక్షితమనం ఎస్పీ వి. రత్న తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్స వాల ముగింపు కార్యక్రమాన్ని శనివారం పుట్టపర్తి ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సులో ప్ర జలు ప్రయాణించడం వలన సంస్థకు ఆదాయం సమకూరడంతోపాటు, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకుంటారన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల భద్రతకు ఎలాంటి ఢోకా ఉండదన్నారు. డ్రైవర్లు వ్యసనాలకు దూరంగా ఉంటూ రోడ్డు నిబంధనలు పాటించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చాలని సూచించారు. ప్రజలుకూడా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు ద్విచక్రవాహనాలు, కార్లు నడపడానికి ఇవ్వకూడదన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే పిల్లతోపాటు తల్లిదండ్రులు కూడా కేసులో చిక్కుకుని ఇబ్బంది పడ్డాల్సి వస్తుందన్నారు. ఈ సందర్భంగా తమ సర్వీసులో ప్రమాదరహిత డ్రైవర్లగా ఎంపికైన 21 మందికి నగదు పురష్కా రం, జ్ఞాపికలను ఆమె అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణాధికారి మధుసూధన్, డిపో మేనేజర్ ఇనయతుల్లా, రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి విశ్వనాథ్, పలువురు డ్రైవర్లు, సిబ్బంది ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వి.రత్న

ప్రమాదాలను నివారిద్దాం : ఎమ్మెల్యే


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారిద్దామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. శనివారం రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలో వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ మనందరి బాధ్యత అన్నారు. సమష్టి కృషితోనే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. వాహనదారులు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలను పాటించాలని, రోడ్డు ప్రమాద నష్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రమాదాలను తగ్గించడంలో రోడ్డు భద్రతా చర్యలు కీలకం అన్నారు. ఇందుకు ప్రతి శాఖ సమష్టిగా పనిచేయడం ఎంతో అవసరమన్నారు. మానవతప్పిదాలు, వాహనాలు అ ధిక వేగం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్టీఓ వీవీఎస్ శర్మ, ఆర్టీఓ శ్రీనివాసులు, అసిస్టెంట్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, టీడీపీ నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, క్రిష్ణమోహన్‌నాయుడు పాల్గొన్నారు.

రేపు కదిరిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 17న కదిరి పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికను జిల్లా స్థాయిలో నిర్వహిస్తామని కలెక్టర్ టీఎస్ చేతన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఈకార్యక్రమం జరుగుతుందన్నారు. ఈగ్రీవెన్స్ సెల్‌లో తనతోపాటు అన్నిశాఖల అధికారులు పాల్గొంటారన్నారు. కదిరి డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పుట్టపర్తి, పెనుకొండ, ధర్మవరం ఆర్డీఓ కార్యాలయాల్లో ప్రజాసమస్యల పరిష్కార వేదికలు జరుగుతాయన్నారు.

ఆర్డీఓ కార్యాలయంలో..

ధర్మవరం: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆర్డీఓ మహేశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధర్మవరం రెవిన్యూ డివిజన్ పరిధిలోని అధికారులందరూ పాల్గొనాలన్నారు.

మెగాజాబ్ మేళా వేదిక మార్పు

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీయువకులు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించే మెగా జాబ్‌మేళాక్యాంపును జగరాజుపల్లి మంగళకర కళాశాలకు మార్చామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో ప్రఖ్యాత కంపెనీలు 50పైగా పాల్గొంటాయని ఉదయం 11 గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభమవుతుందన్నారు. 10తరగతి, ఇంటర్, డిగ్రీ ఆపైన ఉన్నత విద్యార్హతలున్న యువతీయువకులు సద్వినయోగం చేసుకోవాలని కోరారు,

మేస్త్రీ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుకుంట గ్రామానికి చెందిన రైల్వేగ్యాంగ్‌మెన్ మేస్త్రీ భగవంతు అనారోగ్యంతో బాధపడుతూ శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. భగవంతు రైల్వేశాఖలో గ్యాంగ్‌మెన్ మేస్త్రీగా ఉద్యోగం చేస్తున్నాడు. గత కొంతకాలంలో కడుపునొప్పి, అనారోగ్య కారణాలతో బాధపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో గ్రామం వద్ద వంకసమీపానికి వెళ్లి పురుగులమందు తాగాడు. అటుగా వెళ్లిన గ్రామస్థులు గమనించి ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఘనంగా తడక మహోత్సవం


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పల్లె

బుక్కపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నరాయనస్వామి దేవాలయంలో ప్రతియేటా మాఘమాసంలో నిర్వహించే తడక మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లె సిందూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నూతన పట్టువస్త్రాలు సమర్పించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు నాయకత్వంలోనే రాష్ట్రం స్వర్ణాంధ్ర సాధ్యమవుతుందన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని తడక మహోత్సవంలో పూజలు చేసినట్లు చెప్పారు. వారితోపాటు ఆలయ పురోహితులు, మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, గంగాధర్, బుచ్చగారిపల్లి చంద్ర, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కంటి అద్దాలు పంపిణీ



బాలికలకు కంటిఅద్దాలు అందచేస్తున్న దృశ్యం

తనకల్లు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూరిబా బాలిక పాఠశాలలో శనివారం 18మంది బాలికకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్‌రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ సోంపాళ్యం నాగభూషణం, వైద్యులు లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు, ఎస్ఓ హమీదాబీ, బాలికలున్నారు.

ఉద్యోగులపై దాడులు, బెదిరింపులను సహించబోం

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులపై దాడులు, బెదిరింపులను సహించబోమని, మండలంలోని గ్రామ సచివాలయ ఉద్యోగులకు అండగా ఉంటామని ఎంపీడీఓ సాయిమనోహర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల మండలంలో పోతుకుంట గ్రామసచివాలయంలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ జనార్ధన్‌నాయుడుపై ఆ గ్రామానికి చెందిన జయరాం అనే వ్యక్తి దుర్భాషలాడిన సంఘటన జరిగింది. ఈ ఘటన దురదృష్టకరమని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులపై ఇలాంటి దుష్ప్రవర్తన, దాడులు, బెదిరింపులు సహించబోమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలకు వెనకాడబోమన్నారు. డయల్ యువర్ ఎంపీడీఓ అనే కార్యక్రమాన్ని తీసుకువస్తామని, సిబ్బందిపై దాడి, వేధింపులు లేదా ఇతర పనిసంబంధిత సమస్యల గురించి నేరుగా తన ఫోన్‌నెంబర్ 9490610505 నెంబర్‌కు సంప్రదించవచ్చున్నారు. అలాంటి ఉద్యోగుల వివరాలు కూడా బయటకు చెప్పకుండా గోప్యంగా ఉంచుతామన్నారు. ఉద్యోగుల గ్రీవెన్స్ పరిష్కార వేదిక ఎంపీడీఓ కార్యాలయం లో ఏర్పాటు చేస్తున్నామని గ్రామసచివాలయ ఉద్యోగులు తమ సమస్యలు ఈ గ్రీవెన్స్ సెల్‌లో తెలియజేయవచ్చున్నారు. ఉద్యోగులకు మద్దతును అందించడానికి కట్టుబడి ఉన్నామన్నారు.

న్యూస్ బాక్స్

కృష్ణరాయల జయంతిని విజయవంతం చేయండి

గోరంట్ల, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి):విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీకృష్ణదేవరాయల 555వ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గోరంట్ల బలిజసంఘం నాయకులు, టీడీపీ మండల కన్వీనర్ సోముశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటలకు గోరంట్లలోని విజయకుమార్ పెట్రోల్ బంక్ వద్దనుంచి విజయనగర్ కాలనీ వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. మండలంలోని బలిజ కులస్తులందరూ పెద్దఎత్తున హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

పరిగి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని నేతులపల్లి గ్రామ సమీపంలోపెన్నానది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ రంగడు తెలిపిన వివరాల మేరకు అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం తెలుసుకుని సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. కొడిగేపల్లి గ్రామానికిచెందిన రెండు ట్రాక్టర్లు, నేతలపల్లికి చెందిన ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

8న జాతీయ లోక్అదాలత్

మడకశిరటౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని మార్చి 8వతేదీన మడకశిర కోర్టు ఆవరణలో నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి అశోక్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎస్ఐలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఈ అదాలత్‌లో రాజీకాదగ్గ కేసులను పరిష్కరిస్తామన్నారు. రాజీమార్గమే రాజమార్గం అని, సామరస్యంగా కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు.

కష్టపడేవారికి పార్టీలో సముచిత స్థానం


ఈశ్వర్‌ప్రసాద్‌ను సత్కరిస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

పెనుకొండ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : కష్టపడి పార్టీలో పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానం, గుర్తింపు ఉంటుందని మండల కన్వీనర్ శ్రీరాములు, త్రివేంద్రనాయుడు పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ఇప్పటికే కష్టపడిన వారికి పార్టీ అధిష్టానం అనేక పదవులు కట్టబెట్టిందన్నారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు అడదాకులపల్లి మాజీ సర్పంచ్ ఈశ్వర్‌ప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనకు పూలమాలవేసి శాలువకప్పి కేక్‌కట్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ శ్రీరాములు, త్రివేంద్రనాయుడు, బాలాజీ పాల్గొన్నారు.

బూదిలిలో మాఘమాస పూజలు

గోరంట్ల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి):మండలంలోని బూదిలి గ్రామంలో మాఘమాసాన్ని పురష్కారించుకుని శ్రీకాడిమాను ఆంజనేయస్వామిఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్నాటకలోని గౌరీబిదనూరుకు చెందిన చిన్నారుల భరతనాట్య ప్రదర్శన ఆహూతులను అలరింప చేసింది. ఆలయ అర్చకులు శేఖర్ స్వామి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు, మహా మంగళహారతి జరిపారు. ఈకార్యక్రమంలో గుమ్మయ్యగారిపల్లి మారెమ్మ ఆలయ ట్రస్టు నిర్వాహకులు దేవరాజుస్వామి, టీడీపీ నాయకులు ఈడిగ రవి, తదితరులున్నారు.

ఉపాధ్యాయ సంఘాల నిరసన


రీసోర్స్ సెంటర్‌వద్ద నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

పెనుకొండ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ సమావేశం సమయాన్ని పెంచడాన్ని నిరసిస్తూ పెనుకొండలో ఉపాధ్యాయ సంఘాలవారు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. శనివారం సాయంత్రం స్థానిక ఎమ్మార్వో కార్యాలయంవద్ద వారు మాట్లాడుతూ 5గంటల వరకు క్లస్టర్ సమావేశాలు జరుగుతాయని చెప్పి సాయంత్రం 5-30వరకు ఉండాలని చెప్పడం సరైన నిర్ణయం కాదన్నారు. సత్యసాయిజిల్లా యూటీఎఫ్ ఏపీఎస్‌టీఏ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్లస్టర్ రీసోర్స్ సెంటర్ పెనుకొండలో క్లస్టర్ సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులందరూ పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితులకు రూ.10లక్షల బీమా

సోమందేపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : మహిళలకు శాపంగా పరిణమిస్తున్న బ్రస్ట్ క్యాన్సర్ నుండి తమను తాము రక్షించుకునేందుకు కెనరాబ్యాంక్ తరుపున రూ.10లక్షల ఇన్సురెన్స్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తిరుపతి సర్కిల్ ఆఫీసర్ రమ్య తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో కరపత్రాలను విడుదల చేశారు. మహిళలు ఈ అవకాశాన్ని బ్యాంక్ ఖాతా తెరుచుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేనేజర్ గంగాధర్ మాట్లాడుతూ సీనియర్‌సిటిజన్లు బ్యాంకులో చేసుకునే ప్రత్యేక డిపాజిట్లకు 444రోజులకుగాను ఎనిమిదిశాతం వడ్డీ చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై సదస్సు

లేపాక్షి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాల మేరకు టీడీపీ మండల కన్వీనర్ జయప్ప ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా జయప్ప మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు రెవెన్యూ అధికారుల సమక్షంలో పరిష్కారం చూపుతామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన రైతుల సమస్యలు విన్నారు. కొన్ని సమస్యలకు అప్పటికప్పుడే పరిష్కార మార్గం చూపారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

సోమందేపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సాయిసేవా సమితి సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, సుబ్రమణ్యం, గణేష్, నారాయణస్వామి, నరసింహులు ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి.

రెచ్చిపోతున్న ఆర్ఎంపీలు

- విచ్చల విడిగా వైద్యం
- ఒక్క సూది మందుతో రోగం నయం
- మాటలతో మభ్యపెడుతున్న వైనం
- నియంత్రించని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ



హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 15,(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఏ సందులో చూసినా ఆర్ఎంపీ డాక్టర్ల క్లినిక్‌లు కనిపిస్తాయి. పెద్ద డాక్టర్ల దగ్గరకు వెళ్తే ఆ టెస్టు, ఈ టెస్టు అంటూ చేయించి బోలెడు మందులు రాసిచ్చి జేబులు చిల్లు పడేలా వ్యవహరిస్తారని భయపడే సామాన్య ప్రజలు వారి దగ్గరకు వెళతారు. అంతవరకూ బాగానే ఉన్నా హై డోస్ ఇచ్చి అర గంటలో జర్వరం తగ్గేలా చూస్తున్నారు. దీంతో చాల మంది నిజమే కదా ఎంత త్వరగా జ్వరం తగ్గిందో, ఎంత త్వరగా జలుబు, దగ్గు తగ్గిందో అనుకుని వారికి ఆకర్షితులవుతున్నారు.

కానీ అలా చేయడం ప్రాణాలకు హాని అని ఆర్ఎంపీలకూ కూడా తెలుసు. కాని వారి వృత్తి కోసం వారు రెచ్చి పోయి పనిచేస్తున్నారు. ఇటీవల కదిరి, ఇతర ప్రాంతాల్లో ఆర్ఎంపీ వైద్యం వికటించి ప్రాణాలు పోయిన సంగతి పత్రికల్లో వెలువడిన సంగతి విదితమే. వా రు కేవలం అత్యవసర సమయాల్లో వారి వద్దకు వచ్చే రోగులకు ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేయాలి. అంతే కానీ మాత్రలు ఇవ్వడం, సూది మందు వేయడం, సెలైన్ బాటిళ్లు పెట్టడం వంటివి చేయకూడదు. కానీ హిందూపురం ప్రాంతంలో చాల మంది ఆర్ఎంపీలు వారి క్లినిక్‌లలో అన్ని రకాల వైద్య పరికరాలు, మందులు, ఇన్‌జక్షన్‌లు ఉంచుకున్నారు. ఏ మాత్రం భయం లేకుండా చికిత్సలు అందిస్తున్నారు. పరిస్థితి తీరా విషమించితే పెద్ద ఆసుపత్రులకు పంపిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. రెండు రోజుల క్రితం పట్టణ పరిధిలోని ధర్మపురంలో 60 సంవత్సరాలు పై బడిన ఓ వ్యక్తికి నీరసంగా ఉండడంతో అతని స్నేహితుడు తనకు తెలిసిన ఒక ఆర్ఎంపీ వైద్యుడు ఉన్నాడని, ఇంతకు ముందు తనకు ఇలానే ఉంటే ఆయన ట్రీట్‌మెంట్ చేశాడని చెప్పడంతో సరే అన్నాడు. ఓ ఆర్ఎంపీ వైద్యుడు అతని ఇంటి వద్దకే వచ్చి ఏకంగా 6 ఇన్‌జక్షన్‌లు, నిద్ర మాత్రలు ఇచ్చాడు. దీంతో అతను రెండు రోజులు నిద్ర మత్తులో ఉండి పోయాడు. ఏకంగా కోమాలోకి వెళ్ళినంతపనైంది. భయపడిన కటుంబ సభ్యులు మరలా పట్టణంలోని ఓ వైద్యుని వద్దకు తీసుకెళ్ళి ట్రీట్‌మెంట్ ఇప్పించారు. అయినప్పటికీ అతను ఇంకా నీరసంగానే ఉన్నాడు. ఇక చేసేది లేక కటుంబ సభ్యులు ఆయన్ను బెంగళూరుకు తీసుకెళ్లేందుకు సిద్దమయ్యారు. ఇలా ప్రతి రోజు ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నా ఆర్ఎంపీలు ఊరుకోవడంలేదు. ఒక్క హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 50 మందికి పైగా ఆర్ఎంపీలు ఉన్నారు. వారంతా యధాశక్తిగా ఇన్‌జక్షన్‌లు వేస్తూనే ఉన్నారు.

పర్యవేక్షించని జిల్లా అధికారులు

ఇంతలా విచ్చల విడిగా ఆర్ఎంపీలు రెచిపోతున్నా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పైగా ఆకస్మిక తనిఖీల పేరుతో వసూళ్ల దందాకు పాల్పడుతున్నారనే అపవాదులు వినిపిస్తూనే ఉన్నాయి.

అయితే పల్లెల్లో ఆర్ఎంపీల అవసరం ఇప్పటికీ ఎంతో ఉంది. వారికి గతప్రభుత్వ హయాంలో సరైన శిక్షణ ఇవ్వడానికి ప్రయత్నాలు జరిగాయి. ఆ ప్రయత్నాలను పూర్తి స్థాయిలో చేపట్టి శిక్షణ ఇస్తే వారు సమాజానికి ఎంతో ఉపయోగపడతారు.

ఇప్పటికే ఆర్ఎంపీలకు సూచనలు ఇచ్చాం


ఫైరోజాబేగం, డీఎంహెచ్ఓ

ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆర్ఎంపి వైద్యులకు సూచనలు ఇచ్చాం. హద్దు మీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. మాత్రలు, మందులు, ఇంజక్షన్‌లు వేయరాదు. సెలైన్ బాటిల్‌లు పెట్టరాదు. ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకొంటాం.

మా మామ రెండు రోజులు మత్తులోనే ఉన్నారు

మా మామ పరిస్థితి చూసి చాల భయపడ్డాము. ఎప్పుడూ చలాకీగా ఉంటూ పిల్లలతో ఆడుకుంటుండేవాడు. అయితే రెండు రోజులుగా మత్తుగా ఉండటంతో భయపడ్డాము. బెంగళూరు అపోలో ఆసుపత్రిలో నిద్రకు మాత్రలు అడిగినా ఇవ్వలేదు. ఆర్ఎంపీ ఎందుకు ఇంతలా ఇచ్చాడా? అని భయమేసింది.

-- శ్రీరాములు, బాధితుని బంధువు

నిరుద్యోగ సమస్యను తీర్చడానికి కృషి

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

మడకశిరటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వెనకబడిన మడకశిర లాంటి ప్రాంతంలో నిరుద్యోగ సమస్యలు తీర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, అందులో భాగంగానే మెగా జాబ్‌మేళాను నిర్వహించినట్లు టీటీడీ బోర్డు సభ్యులు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన 50 కంపెనీలు పాల్గొనగా 400 మందికి నియామక పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్లపాటు రాష్ట్ర యువత ఉద్యోగ అవకాశాలు లేక పక్క రాష్ట్రాలకు వలసలు పోవాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతలో ఓ భరోసా వచ్చిందని, తమకు అందుబాటులోకి వస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంతోపాటు సొంత ప్రాంతంలో ఉండి వర్క్‌ఫ్రం హోం చేసుకొంటూ కుటుంబానికి దగ్గరగా ఉండే అవకాశాలు కూటమి ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఈజాబ్ మేళాకు 1300 మందికిపైగా నిరుద్యోగ యువత హాజరుకాగా ఇంటర్వ్యూలో 400 మందికి శనివారమే నియామక పత్రాలు అందించారు. మరో 300 మందిని షార్ట్‌లిస్టు చేశారని తెలిపారు. భవిషత్తులో మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహించి పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు

- ఆసుపత్రి భవనం పరిశీలించిన ఎంపీ, బెల్ కంపెనీ ప్రతినిధి

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎంపీ బీకే పార్థసారధి తెలిపారు. శనివారం రొద్దం మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని ఎంపీ బీకే పార్థసారధి బెల్ కంపెనీ ప్రతినిధులు పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ బీకే మాట్లాడుతూ 65సంవత్సరాల క్రితం నిర్మించిన ప్రభుత్వ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బీకే పార్థసారధి

భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందన్నారు. ఉందన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సౌకర్యాలు అందించాలన్న సంకల్పంతో బెల్ కంపెనీ యాజమాన్యాన్ని సంప్రదించామన్నారు. వారు స్పందించి శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని చూడటానికి రావడం హర్షనీయమన్నారు. త్వరలోనే బెల్ కంపెనీ సౌజన్యంతో నూతనంగా 30పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, నాయకులు రొద్దం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తోలుకోవడానికి అనుమతి ఇవ్వండి : ఎంపీ

పరిగి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): చెరువు నుంచి రైతులు తమ పొలాల్లో గుంతలు పూడ్చుకోవడానికి, ఇంటి నిర్మాణం కోసం మట్టిని తోలుకోవడానికి అనుమతి ఇవ్వాలని ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామనాయుడుకు హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి లేఖ రాసినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో జీఓ విడుదల చేసి, ప్రభుత్వానికి రుసుము చెల్లించి మట్టిని తోలుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు.

చెత్తతో సంపద సృష్టించాలి/ వాడవాడలా స్వచ్ఛాంధ్రలో పాల్గొన్న నాయకులు, అధికారులు


గుడిబండలో విద్యార్థుల మానవహారం


పెనుకొండలో చీపురుపట్టి శుభ్రంచేస్తున్న టీడీపీ నేత వెంకటేశ్వరరావు

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో పెద్దఎత్తున స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం చేపట్టినట్లు కన్వీనర్ శ్రీరాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సతీష్‌కుమార్, టీడీపీ నాయకుడు వెంకటేష్వర్‌రావు పాలొన్నారు పరిగిలో స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం ఎంపీడీఓ శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు.

చిలమత్తూరులో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన కర్తవ్యమని ఎంపీడీఓ రమణమూర్తి పేర్కొన్నారు. గోరంట్లలోనాయకులు, అధికారులు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. గోరంట్లలో ఎంపీడీఓ నరేంద్రకుమార్, పంచాయతీ ఇఓ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సోమందేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్ఎం నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మడకశిరలో పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం అని కల్లుమర్రి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రాంప్రసాద్ పేర్కొన్నారు. అగళిలో పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ జాఫర్ పేర్కొన్నారు. ఆరోగ్య విషయాలపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని డా.శివానంద పేర్కొన్నారు. గుడిబండలో పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని ఎంపీడీఓ గంగాధర్ పేర్కొన్నారు. అమరాపురంలో కూడా స్వచ్ఛతా సేవ జరిగింది.

ఉత్తమ అవార్డు అందుకున్న పెనుకొండ ఆర్టీసీ డ్రైవర్లు


అవార్డు అందుకుంటున్న డ్రైవర్ అంజినాయక్

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఉత్తమ డ్రైవర్‌గా పెనుకొండ డిపోకు చెందిన అంజినాయక్, అలాగే జోన్‌లో ఉత్తమ డ్రైవర్‌గా నాగరాజులు అవార్డులు అందుకున్నారు. శనివారం రోడ్డు భద్రతా మాసోత్సవాలు కడపజోన్‌లో జరిగాయి. ఈ క్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్ శాలువా కప్పి, మెమెంటో అందించి, అవార్డును, పారితోషికాన్ని అందించారు.


జోనల్ ఉత్తమ డ్రైవర్‌గా అవార్డు అందుకుంటున్న నాగరాజు

ఘనంగా వెంకటరమణస్వామి విగ్రహప్రతిష్ఠ

పెనుకొండ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదురుగా పెట్రోల్‌బంక్ పక్కన విశ్వహిందూపరిషత్ ధర్మపోరాటంలో విజయకేతనంగా కొత్తగా నిర్మించిన పాల వెంకటరమణస్వామి ఆలయంలో స్వామి విగ్రహప్రతిష్టాపన, కార్యక్రమాలను నిర్వహించారు.

వైభవంగా శనైశ్చరుడి వెండి పల్లకి ఉత్సవం

పావగడ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : పావగడ శనైశ్చరస్వామి వెండి పల్లకి రథోత్సవం శనివారం రాత్రి వందలాది మంది భక్తుల నడుమ వైభవంగా జరిగింది. వేద పండితులు సత్యనారాయణశాస్త్రి ఉత్సవ విగ్రహాలను వెండి పల్లకిలో ఉంచగా, ఆలయ కమిటీ అధ్యక్షులు, సిబ్బంది కలిసి రథాన్ని లాగారు. జేష్టదేవి సమేత శని మహాత్ముని ఉత్సవం మాఘమాసంలో అత్యంత వైభవంగా జరుపుకోవడం హర్షణీయమని ఆలయ కమిటీ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ తెలిపారు.

పంటలకు నిప్పు

మడకశిర రూరల్ ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జిల్లేడగుంట గ్రామానికి చెందిన వసంతప్ప పొలానికి ఆకతాయిలు శనివారం నిప్పుపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న చుట్టుప్రక్కల రైతులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు వెంటనే రైతు పొలం వద్దకు వచ్చి మంటలను ఆర్పివేశారు.

ఘనంగా సేవాలాల్ జయంతి

పావగడ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి):తండావాసుల ఆరాధ్యదైవం సంతోష్ సేవాలాల్ జయంతిని పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంతోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ వరదరాజులు తాలూకా కార్యాలయం సిబ్బంది, నాయకులు సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అనేక మంది నాయకులు జయంతిలో పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు.

మహాకుంభమేళాకు బయల్దేరిన ఆర్టీసీ బస్సు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 15, (ఆంధ్రజ్యోతి):ఉత్తర ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాకు హిందూపురం నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు శనివారం తరలివెళ్ళింది. ఈసందర్భంగా ప్రజలకు సేవలందించేందుకు ఆర్టీసీ సంస్థ ఎప్పుడూ ముందుంటుందని ఇన్‌ఛార్జు డిపో మేనేజర్ రామసుబ్బయ్య, మెకానికల్ ఇంజనీర్ నిశాంత్‌లు పేర్కొన్నారు. ప్రైవేట్ సంస్థలతో పోలిస్తే టికెట్ ధర కూడా చాలా తక్కువన్నారు.

రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో చోరీ

హిందూపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని టీచర్స్‌కాలనీ సమీపంలో ఉన్న రిటైర్డ్ ఉద్యోగి శివప్రసాద్‌రావు ఇంటిలో 23తులాల బంగారం దుండగులు ఎత్తుకెళ్లినట్లు టూటౌన్ ఇన్చార్జ్ సీఐ జనార్దన్ తెలిపారు. పశుసంవర్ధకశాఖలో పనిచేసిన శివప్రసాద్‌రావు, టీచర్స్‌కాలనీ సమీపంలో నివాసముంటున్నాడు. ఈనెల 6న ఆయన కుమార్తె బంధువుల ఇంటికి వెళ్లాడు. శుక్రవారం రాత్రి తిరిగి వచ్చి చూసేసరికి దొంగలు మేడపై నుంచి తలుపులు పగలకొట్టి ఇంట్లో ప్రవేశించి బీరువాలోని 23తులాల ఆభరణాలు తీసుకెళ్లారన్నారు. బాధితుడు శివప్రసాద్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : పెనుకొండ పట్టణంలోని నారాయణమ్మ కాలనీలో సమీపంలో గతనెల 20న ఉపాధ్యాయుడి ఇంటిలో చోరీ చేసిన దొంగను శనివారం పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అతడికి 14రోజులు రిమాండు విధించినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెనుకొండ పట్టణంలోని నారాయణమ్మ కాలనీ సమీపంలో పట్టపగలే ఉపాధ్యాయుడు నాగార్జున ఇంటిలో లేని సమయంలో చోరీ జరిగింది. అప్పట్లో సేకరించిన ఆధారాలతో గాలించి పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడు అనంతపురానికి చెందిన సుహేల్ ఎక్కువగా బెంగళూరు ప్రాంతంలో ఉంటాడన్నారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం


మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేత వెంకటేశ్వరరావు

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : మాజీ వార్డు మెంబర్ బోయగోపీ అనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం మృతదేహానికి పూలమాలలువేసి టీడీపీ నేత వెంకటేశ్వర్‌రావు, కన్వీనర్ శ్రీరాములు, త్రివేంద్ర నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి సవిత ఆదేశాలతో రూ.30వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. టీడీపీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

గుండెపోటుతో సీనియర్ అసిస్టెంట్ మృతి

లేపాక్షి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జయనాయక్(54) శనివారం రాత్రి 8గంటల సమయంలో గుండెపోటుతో మృతిచెందాడు. ఈయన లేపాక్షి ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేస్తూ అందరి మన్ననలు పొందాడు. మంచి వ్యక్తిగా, బాధ్యతగల ఉద్యోగిగా పనిచేస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచాడు. గతంలో గోరంట్ల మండలపరిషత్ కార్యాలయంలో చాలా ఏళ్లు పనిచేసినట్లు తోటి ఉద్యోగులు పేర్కొన్నారు.

హక్కుదారులకు భూమి స్వాధీనం

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ హయాంలో శోత్రియం భూమిని ఫేక్ రిజిస్ట్రేషన్ ద్వారా కబ్జాచేసిన భూమిని శనివారం రెవెన్యూ అధికారులు సర్వేచేసి హక్కుదారులకు భూమిని స్వాదీనం చేశారు. వివరాల్లోకెళితే శెట్టిపల్లి పంచాయతీ బొజ్జిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో శోత్రియం భూమికి సంబంధించి శెట్టిపల్లి గ్రామానికి చెందిన వెంకోబరావు సర్వేనంబరు 28-2లో 28సెంట్ల భూమిని పసుపుకుంకుమ కింద తన కుమార్తె సరోజమ్మ పేరిట చేశారు. అయితే భూమికి సంబంధించిన వారు గ్రామంలో లేకపోవడంతో శెట్టిపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు కృష్ణారెడ్డి శోత్రియం భూమిపై కన్నేశాడు. తన భార్యపేరిట బుక్కపట్నం సబ్‌రిజిష్టర్ కార్యాలయంలో 2021లో రిజిష్టర్ చేయించుకున్నారు.ఎ విషయం తెలుసుకున్న కుమార్తె సరోజమ్మ, కుమారుడు చలపతిరావు పూర్వీకుల ఆస్తిని కబ్జాచేశారని తమకు న్యాయం చేయాలని ఇటీవల ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు బాదితులు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు శనివారం తహసీల్దార్ శ్రీధర్, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, సర్వేయర్లు, వీఆర్ఓలు గ్రామానికి చేరుకుని రికార్డుల ప్రకారం కబ్జా అయిన భూమిని సర్వేచేసి హద్దులను చూపించనున్నట్లు తెలిపారు.

200 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి..


కొత్తవారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గంలో వైసీపీ పార్టీకి సమర్థవంతమైన నాయకత్వం లేకపోవడంతో నాయకులు, కార్యకర్తలు సైతం పార్టీకి గుడ్‌బై చెబుతున్నారు. శనివారం వైసీపీకి భారీ షాక్ తగిలింది. అగళి మండల ఎంపీపీ రేణుకా కామరాజు, వైస్ఎంపీపీ హేమంత్‌రాజు, ఎంపీటీసీలు నాగరాజు, సురేష్, సీనియర్ నాయకులు గోవిందప్పతోపాటు 200 కుటుంబాలు పసుపు కండువాను కప్పుకొన్నారు. ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిల ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు. వారందరికీ ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీలు పార్టీలోకి సాదరంగా స్వాగతం పలికారు. రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, జడ్పీటీసీ సభ్యులు ఉమేష్ పాల్గొన్నారు.